క్లుప్తంగా

ఘనంగా అనఘాష్టమి పూజలు

అనపర్తి: గ్రామంలోని ఔదంబర దత్త పీఠంలో శుక్రవారం అనఘాష్టమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త, ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ మల్లిడి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రతి నెలా ఈ పూజలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అనఘాష్టమి పూజలను అర్చకులు బాలాజీ శర్మ నిర్వహించగా, అనఘ దత్త రక్ష మంత్ర హోమాన్ని అర్చకులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ క్రతువును కనులారా వీక్షించడానికి జిల్లా నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు. నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. వారికి అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

నేడు రీ సర్వే గ్రామసభ

సీతానగరం: మండలంలోని మునికూడలిలో శనివారం రీ సర్వే గ్రామ సభ నిర్వహిస్తామని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మునికూడలిలో రీ సర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూతింగ్ వర్క్ పూర్తి చేయడం జరిగిందన్నారు. దీంతో శనివారం ఉదయం 10 గంటలకు పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశం తదుపరి మునికూడలి గ్రామంలో వ్యవసాయ భూములు గల రైతులకు 9 (2) నోటీసులు జారీ చేస్తామన్నారు. గ్రామంలోని రైతులందరూ హాజరుకావాలని కోరారు.

చక్రద్వారబంధం గ్రామానికి ఆర్టీసీ బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధం గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభమైంది. గ్రామస్తుల కోరిక మేరకు ఆర్టీసీ ఈ సౌకర్యాన్ని కల్పించింది. రాజమహేంద్రవరం నుంచి చక్రద్వారబంధం మీదుగా రాజానగరం వరకూ రాకపోకలు సాగించేలా గతంలో ఉన్న సర్వీసునే పునఃరుద్ధరించారు. ఈ బస్సు సర్వీసును శుక్రవారం ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కూడా పాల్గొన్నారు.

గుండెపోటుతో విలేకరి మృతి



బండి సత్య ప్రసాద్ (ఫైల్)

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నంలో నివాసం ఉంటున్న సీవీఆర్ న్యూస్ చానల్ విలేకరి బండి సత్యప్రసాద్ (54) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన పలు పత్రికల్లో విలేకరిగా పని చేశారు. మృతదేహాన్ని స్వగ్రామమైన ద్రాక్షారామం సమీపంలోని కుందూరుకు తీసుకువెళ్లారు. సత్యప్రసాద్ మృతికి మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, ఎంపీపీ గుద్రాల జ్యోత్స్న, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజు, మండల కన్వీనర్ గంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, మండల పంచాయతీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోంద్రపు ముత్యాలు సంతాపం తెలిపారు.

ఆర్టీసీ కండక్టర్‌పై దొంగల దాడి

బిక్కవోలు: ఆర్టీసీ కండక్టర్‌పై దొంగలు దాడి చేసి సెల్‌ఫోన్, నగదు లాక్కుని పరారయ్యారు. వివరాల్లోకి వెళితే.. ఊలపల్లికి చెందిన ప్రసాద్ ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. రాజమహేంద్రవరం డిపోలో విధులు ముగించుకుని బైక్‌పై గురువారం రాత్రి తన స్వగ్రామానికి వస్తున్నాడు. బలభద్రపురం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అతడిని నలుగురు దొంగలు అటాకాయించారు. అతడిపై దాడి చేసి సెల్‌ఫోన్, నగదు తీసుకుని పారిపోయారు. బాధితుడు బిక్కవోలు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ సుమంత్, ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

తల్లీ కుమార్తెల అదృశ్యం

సీతానగరం: సింగవరానికి చెందిన తల్లీకుమార్తెల అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్ కుమార్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. సబ్బితి కృష్ణంరాజు, మునికన్య భార్యాభర్తలు. వారికి తొమ్మిదేళ్ల సృజన అనే కుమార్తె ఉంది. మునికన్య తన భర్తతో గొడవపడి గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు కుమార్తెను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. అదే గ్రామంలోని అత్తింటికి వెళ్లి ఆరా తీయగా రాలేదని తెలియడంతో ఆమె భర్త శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బాల్య వివాహాలను నిరోధించాలి

బిక్కవోలు: బాల్య వివాహాలను నిరోధించాలని కొమరిపాలెం సర్పంచ్ వాసంశెట్టి రవి కుమార్ అన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని కమిటీ ద్వారా బాల్య వివాహాలు జరుగకుండా చూడాలన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలతో అవినీతి సంపద

- బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి తీరు దారుణం
- చెరువుల్లో యథేచ్ఛగా తవ్వకాలు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- బిక్కవోలు లింగాల చెరువు పరిశీలన



బిక్కవోలు లింగాల చెరువులో మట్టి అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: సంపద సృష్టి పేరుతో కూటమి నాయకులు అవినీతి సంపదను పోగుచేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బిక్కవోలు గ్రామంలోని లింగాల చెరువులో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ప్రాణాధారంగా నిలిచే చెరువులను కూడా అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారన్నారు. లింగాల చెరువు నుంచి నాలుగు రోజులుగా రోజుకు వెయ్యి ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారన్నారు. కాకినాడ జిల్లాలోని కరప ప్రైవేటు లేఅవుట్లకు ఈ మట్టి రవాణా అవుతోందన్నారు. చెరువు లోతుగా మారడం వల్ల పలు ప్రమాదాలు జరుగుతాయని, పశువులు దిగటానికి కూడా ఇబ్బందులు కలుగుతాయన్నారు. గతంలో ఇదే ఎమ్మెల్యే బిక్కవోలు గ్రామంలోని పేదల భూమిలో మట్టిని తవ్వి, దాదాపు రెండు కోట్ల రూపాయల విలువైన మట్టిని అమ్మి పెట్టుకున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. గతంతో కాపవరం చెరువులో నలుగురు మరణించారని, నల్లమిల్లి గ్రామంలో కూడా ప్రాణనష్టం జరిగిందన్నారు. ఇప్పుడు ఇలాగే చెరువుల మట్టిని తవ్వి, గట్లు లేకుండా వదిలేసి, ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారన్నారు. ఎమ్మెల్యే అవినీతి చర్యలను ఎప్పటికప్పుడు బహిరంగం చేస్తూ ఉంటామన్నారు. చెరువులు, రైతుల హక్కులు, నీటి ప్రాముఖ్యతపై రాజీ పడబోమని స్పష్టం చేశారు. రైతుల కోసం వైఎస్సార్ సీపీ తరఫున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలోని మాజీ ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్ రెడ్డి, వైఎస్సార్ సీపీ గువ్వల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వకంగా..



అనపర్తిలో బొత్స సత్యనారాయణను కలసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు

అనపర్తి: మండపేటలో జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో అనపర్తిలో విశ్రాంతి తీసుకున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, అనపర్తి మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

చెత్త సేకరణ బాధ్యతగా చేపట్టాలి



రామేశ్వరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేంద్ర రెడ్డి

పెదపూడి: పారిశుధ్య సిబ్బంది నిత్యం ప్రతి ఇంటికీ వెళ్లి తడి, పొడి చెత్త సేకరణను సక్రమంగా, బాధ్యతగా చేపట్టాలని ఎంపీడీవో కె.నరేంద్ర రెడ్డి అన్నారు. రామేశ్వరంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద శుక్రవారం సచివాలయం కార్యదర్శులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలకు తడి, పొడి చెత్త సేకరణపై వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో చెత్త సేకరణ బాధ్యతగా చేపట్టే విధంగా సచివాలయ సిబ్బందికి ప్రత్యేక డ్యూటీలు వేశామన్నారు. ప్రతి రోజు ఉదయాన్నే ఒక్కొక్క ప్లానింగ్ సెక్టార్‌కు ఒక్కొక్క సచివాలయ ఉద్యోగి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారన్నారు. పారిశుధ్య కార్మికులకు కొబ్బరి నూనె, డెటాల్, సబ్బులు, హ్యాండ్ గ్లౌజ్‌లు, జాకెట్లు, విజిల్స్, హెల్మెట్లు సచివాలయం కార్యదర్శులు ఏర్పాటు చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు ప్రతి ఇంట్లో మహిళలకు తడి, పొడి చెత్తలను వేరుగా అందించే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.సత్యనారాయణ రెడ్డి, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాస చౌదరి, ఎస్.కనక నాగేంద్ర, భోగరాజు ప్రసన్నాంజనేయులు, కొమ్మన తరుణ్, పి.సూర్యలక్ష్మి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన



సీతానగరం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ జ్యోత్స్న

సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ గుద్రాల జ్యోత్స్న శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ రికార్డులను తనిఖీ చేశారు. ప్రతి రోజూ ఎంత మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారో ఆరా తీశారు. ఆపరేషన్ గది, పేషెంట్లు ఉంచే రూమ్‌లను, మందులు స్టాక్‌ను పరిశీలించారు. పాము, కుక్కకాటు వ్యాక్సిన్లు ఉన్నాయో, లేదో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఆపరేషన్ రూమ్‌లో శ్లాబ్ పెచ్చులుగా ఊడిపోతోందని, రోగులు ఉండే గదులు పాడైపోయాయని, బెడ్‌లు కూడా బాగా లేదన్నారు. మందులు అందుబాటులో ఉన్నాయని, పీహెచ్‌సీలో చక్కని వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆమె వెంట పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య ఉన్నారు.

లక్షల రూపాయలు కట్టి మోసపోయాం

- కనీస వసతులూ కల్పించలేదు
- బ్రిడ్జికౌంటీ నివాసితుల ఆవేదన



ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న బ్రిడ్జి కౌంటీ వాసులు

రాజానగరం: తమ నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి, సరైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా మోసం చేశారని బ్రిడ్జి కౌంటీలోని నివాసితులు వాపోయారు. ఈ మేరకు ప్లకార్డులు చేతపట్టుకుని, తమ నివాసాల ముంగిట శుక్రవారం నిరసన తెలిపారు. కోర్ కమిటీ సభ్యులు మాధవ్, దాసు, వెంకట్రావు, రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ రహదారిని ఆనుకుని 50 ఎకరాల విస్తీర్ణంలో మినీ అమెరికా పేరుతో 2013లో వెంచర్ వేస్తే, నిజంగా ఆ స్థాయిలోనే అభివృద్ధి చేస్తారేమోనని ఆశ పడి అప్పులు చేసి విల్లాలు, అపార్టుమెంట్లు తీసుకున్నామన్నారు. అనంతరం మినీ అమెరికా పేరును బ్రిడ్జి కౌంటీగా మార్చేసి తమనే ఏమార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్కులు, షాపింగ్ మాల్స్, క్లబ్, జిమ్, మోడ్రన్ స్కూల్, స్విమ్మింగ్ పూల్, విశాలమైన రోడ్లు, మంచినీటి సదుపాయం .. ఇలా సకల సదుపాయాలు 2017 నాటికల్లా అందిస్తామంటే నమ్మామన్నారు. దశాబ్ద కాలం దాటిపోయినా నేటికీ ప్రైవాటిలో ఏ ఒక్కటీ పూర్తి కాలేదన్నారు. క్లబ్ హౌస్ కోసం ప్రత్యేకంగా సొమ్ములు తీసుకున్నారని, ఇప్పటి వరకు ఒక్క ఇటుక కూడా పెట్టలేదన్నారు. రోడ్లు పాడై పిచ్చి మొక్కలు మొలిచి వెక్కిరిస్తున్నాయని ఆవేదన చెందారు. తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వేడుకున్నారు.

వరంగల్ ఎన్ఐటీకి అనపర్తి విద్యార్థి ఎంపిక



విద్యార్థి సునీల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్స్ అబ్బాయి రెడ్డి, పీఆర్ఎల్ స్వామి

అనపర్తి: ప్రతిష్టాత్మక వరంగల్ ఎన్ఐటీలో అనపర్తికి చెందిన ఎం.సునీల్ సీటు సాధించాడు. ఈ విషయాన్ని జీబీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి శుక్రవారం తెలిపారు. తమ కళాశాల విద్యార్థి సునీల్ జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్ష 2025లో ఆల్ ఇండియా 208వ ర్యాంకు సాధించాడన్నారు. దీంతో వరంగల్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కెమికల్ ఇంజినీరింగ్‌లో సీటు లభించిందన్నారు. లక్షల మంది హాజరయ్యే ఈ ప్రవేశ పరీక్షలో గ్రామీణ ప్రాంతానికి చెందిన సునీల్ ప్రతిభ సాధించడంతో కళాశాల కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు) అభినందించారు. ఆ విద్యార్థికి తర్ఫీదునిచ్చిన అధ్యాపక బృందాన్ని కూడా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు బి.రత్నారెడ్డి, డీవీఆర్‌ఏ పాపిరెడ్డి, కె.హరినాథరెడ్డి, ఇంటర్మీడియెట్ అకడమిక్ సలహాదారు జి.జగన్నాథరెడ్డి, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌పీ అబ్బాయిరెడ్డి పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ

రాజానగరం: కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), రాజమహేంద్రవరంలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ క్లైమేట్ అండ్ అగ్రికల్చర్ (ఎన్ఐఆర్‌సీఏ) సహకారంతో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో పాటు పోషకాహారం ఆవశ్యకతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక (ఎస్‌సీఎస్‌పీ) అమలులో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని తూర్పుగానుగూడెం , కలవచర్లలో 95 మంది గర్భిణులు, పిల్లలకు కిట్లు అందజేశారు. ఈ కిట్లలో జొన్నలు, రాగి వెర్మిసెల్లి, జొన్న ఉప్మా మిశ్రమం, మిల్లెట్ ఆధారిత బిస్కెట్లు, కుకీలు, జొన్న మురుకులు, అటుకుల మిక్చర్, కిచడి రవ్వ వంటి మిల్లెట్ ఆధారిత ఉత్పత్తులు ఉన్నాయని కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ సేవా దృక్పథం అవసరం



సర్పంచ్ కుమారి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణులు

అనపర్తి: సమాజంపై ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సర్పంచ్ వారా కుమారి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వారా కుమారి కేక్ కట్ చేసి అందరికీ అందజేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పార్టీ శ్రేణులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సత్తి రాంబాబు, అనపర్తి టౌన్ పార్టీ కన్వీనర్ నల్లమిల్లి మురళీ మోహన బాలకృష్ణారెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు వల్లభశెట్టి సతీష్, ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్, కర్రి దాసు, బంగారు శ్రీను, తుమ్మా రాజేశ్వరి, ఏడుకొండలు, నియోజకవర్గ పార్టీ మహిళాధ్యక్షురాలు ఇమంది విజయకుమారి పాల్గొన్నారు.

చేతిరాతలో నైపుణ్యం పెంచుకోవాలి



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న హెచ్ఎం అరుణ

రంగంపేట: విద్యార్థులు బాల్యం నుంచే చేతిరాతలో నైపుణ్యం పెంచుకోవాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గరిమెళ్ల అరుణ సూచించారు. చంద్రేడులోని మండల ప్రజా పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఆమె తల్లిదండ్రులు జగన్నాథశాస్త్రి, సుబ్బలక్ష్మి స్మారకార్థం రూ.మూడువేలు విలువైన నోట్ పుస్తకాలను శుక్రవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్షరాలు, పదాలు, అంకెలను చదువుతూ, తప్పులు లేకుండా గుండ్రంగా రాస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. కాగా.. ఏటా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు అరుణకు ఉపాధ్యాయులు రాంబాబు, కృష్ణ, సమీరా, ఆయా నాగమణి కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌సీల తనిఖీ



కొంకుదురు పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఎం డాక్టర్ వెంకటేశ్వరరావు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు, కొంకుదురు పీహెచ్‌సీలను డీఎంహెచ్ఎం డాక్టర్ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. అక్కడి రికార్డులను తనిఖీ చేయడంతో పాటు మందులను సక్రమంగా వస్తున్నాయా అని ఆరా తీశారు. బిక్కవోలు డాక్టర్ దుర్గాదేవి, కొంకుదురు డాక్టర్ జి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

వెంకట రమణ చౌదరితో విభేదాలు లేవు



విలేకరులతో మాట్లాడుతున్న పెందుర్తి అభిరామ్

కోరుకొండ: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఆ పార్టీ నాయకుడు పెందుర్తి అభిరామ్ అన్నారు. కోరుకొండలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నలుగురు వ్యక్తుల కారణంగా పార్టీ నిర్మాణ పరంగా నష్టపోతోందన్నారు. కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాల్లో తాను పాల్గొనకుండా కార్లు అడ్డుపెడుతూ ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో పెందుర్తి సేవా సమితి పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



బొబ్బిల్లంక ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

సీతానగరం: బొబ్బిల్లంకలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను స్టేట్ లెవెల్ విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏడీఏ రవీంద్ర బొబ్బిల్లంకలోని వెంకటేశ్వర ఏజెన్సీ, దేవీసత్య ఫెర్టిలైజర్ షాపుల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్లు, సేల్స్ రిజిస్టర్లను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో దుకాణాల్లో ఎరువుల స్టాక్ తక్కువగా ఉందని, కొనుగోలు, అమ్మకాల్లో ఎటువంటి తేడాలు లేవన్నారు. కార్యక్రమంలో కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు, ఏవో ఎ.గౌరీదేవి, ఏఈవో గురుప్రియ, వీఏఏ రమాదేవి పాల్గొన్నారు.

23న మండల సమావేశం

పెదపూడి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నామని ఎంపీడీవో కె.నరేంద్ర రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఎంపీపీ కేతా తులసి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. గత మూడు నెలలుగా మండలంలో జరిగిన ప్రగతిపై సమావేశంలో చర్చిస్తారన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై నాగరాజు

కోరుకొండ: సైబర్ నేరాలు, గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలు, పోక్సో చట్టంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, తద్వారా ప్రజలకు చైతన్యం కలిగించాలని ఎస్సై కూన నాగరాజు అన్నారు. పశ్చిమగానుగూడెంలోని సృజన కాలేజీలో శుక్రవారం సాయంత్రం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమాజంలో మార్పు విద్యార్థుల ద్వారానే జరుగుతుందన్నారు. మోటార్ వెహికల్ చట్టం ప్రకారం వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్, అన్నిరకాల అనుమతులుండాలన్నారు.

సమగ్ర పోషక యాజమాన్యంతో చీడపీడల నియంత్రణ

రాజానగరం: నేల స్వభావం, ఎరువుల వాడకం, వాతావరణ పరిస్థితులను బట్టి చీడపీడల ఉధృతి ఆధారపడి ఉంటుందని దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. మండలంలోని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో జిల్లాలోని వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులకు సర్టిఫికెట్ కోర్సులో భాగంగా గత 12 రోజులుగా ఇస్తున్న శిక్షణను శుక్రవారం ఆయన సందర్శించారు. 'నేల స్వభావం, చీడపీడల ఉధృతి, యాజమాన్య పద్ధతులు' అనే అంశంపై శిక్షకులకు అవగాహన కలిగించారు. ప్రయోగశాలలో శాస్త్రవేత్తలు చేసిన పరిశోధన సిఫార్సుల మేరకు సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, రసాయన ఎరువులు వాడి, భూసార పరిరక్షణ చేసుకుంటూ మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. శిక్షకులతో కలిసి ఖరీఫ్ సాగు చేస్తున్న వరి పంట క్షేత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆట వస్తువుల వితరణ



విద్యార్థులకు ఆట బొమ్మలు అందజేసిన కర్రి అఖిల

బిక్కవోలు: తొస్సిపూడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఆట బొమ్మలు అందజేశారు. ఈ సందర్భంగా కర్రి అఖిల మాట్లాడుతూ తన తమ్ముడు, తాను ఒకేసారి పుట్టామని, అయితే ప్రమాదంతో తమ్ముడు మృతి చెందాడన్నారు. అతడి జయంతి సందర్భంగా పిల్లలకు ఆట వస్తువులు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం వీవీవీ సత్యనారాయణ, కర్రి శ్రీనివాసరావు, సత్య గౌరీ తదితరులు పాల్గొన్నారు.


శాకంబరి అలంకరణలో అమ్మవార్లు



అనపర్తిలో మహాలక్ష్మి అమ్మవారు



పందలపాకలో గౌరమ్మ తల్లి



సంపరలో విజయ దుర్గమ్మ

అనపర్తి: గ్రామంలోని శాంతిపురంలో కొలువైన గణపతి, సరస్వతీ సహిత మహాలక్ష్మి అమ్మవారిని శుక్రవారం శాకంబరీ దేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఏ.రామకృష్ణ శర్మ, ఆయన కుమారుల ఆధ్వర్యంలో అమ్మవారిని కూరగాయలు, ఆకు కూరలతో అలంకరించారు. అలంకారభూషితురాలైన అమ్మవారిని దర్శించుకోవడానికి భారీగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంపరలో..

పెదపూడి: ఆషాఢ మాసంలోని నాలుగో శుక్రవారం సందర్భంగా సంపరలోని విజయదుర్గమ్మను శాకంబరీ దేవీగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు, లలితా సహస్ర పారాయణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పందలపాకలో..

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని దేవాంగుల వీధిలో కొలువైన గౌరమ్మ తల్లి శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని కూరగాయలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.